
సాక్షి ఒడిశా

గురువారం । 4 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని, ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,82,102లు, బంగారం 1.5గ్రాములు, వెండి 307 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అంతర్జాతీయ సేవలకు శ్రీకారం

- సింగపూర్, బ్యాంకాక్ విమాన టిక్కెట్ బుకింగ్ ప్రారంభం

- 8లో



ఏడీఎంకు వీడ్కోలు

పర్లాకిమిడి: జిల్లా అదనపు మేజిస్ట్రేటుగా పనిచేసిన సంగ్రాం శేఖర్ పండా ఎంకేసీజీ వైద్య కళాశాల పరిపాలనాధికారిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ లింగరాజ్ పండా తన కార్యాలయంలో వీడ్కోలు పలికి, సత్కరించారు.

న్యూస్‌రీల్

జిల్లా వ్యవసాయాధికారిగా మనోజ్‌కుమార్



ప్రధాన్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

రాయగడ: జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా మనోజ్‌కుమార్ ప్రధాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా అధికారిగా ఉన్న రామచంద్ర దాస్ మార్చి 31న ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ప్రధాన్ నియమితులయ్యారు. మనోజ్‌కుమార్ గతంలో సంబల్‌పూర్ జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తుండేవారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు సిబ్బంది స్వాగతం పలికి, అభినందించారు.

పూరీ తీరంలో విషాదం

- పర్యాటకుల బోటు మేనక..
- తండ్రీ, కొడుకులు మృతి

భువనేశ్వర్: పూరీ సముద్రంలో స్నానం చేస్తుండగా తండ్రీ, కొడుకులు సహా ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు పర్యాటకులు కెరటాల ధాటికి కొట్టుకుపోయారు. వీరిలో ముగ్గురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగా.. తండ్రీ కొడుకులు మృతిచెందారు. మృతులు రంజన్ దాస్(50), కుమారుడు రుషవ్ దాస్(16)గా గుర్తించారు. పశ్చిమబెంగాల్ హౌరా ప్రాంతానికి చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు మంగళవారం పూరీ పర్యటనకు వచ్చారు. స్థానిక హోటల్‌లో బస చేయగా, బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో అంతా కలిసి ఫ్యామిలియా హోటల్ ముందు సముద్రంలో స్నానానికి దిగారు. అయితే సముద్రపు అలల తాకిడి తీవ్రతతో వీరంతా గల్లంతయ్యారు. తీరంలో ఉన్న అగ్నిమాపక దళం, లైఫ్‌గార్డ్‌లు వెంటనే రంగంలోకి దిగి, ముగ్గురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. తండ్రీ కొడుకులు రంజన్, రుషవ్ మరణించారు. పూరీసాగర తీరం ఠాణా పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

బరంపురం: గంజాం జిల్లా హింజిలికాట్ పోలీసు స్టేషన్ పరిధి మకరజులా గ్రామంలో పొలం మధ్యలో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి అభిమన్యు సాహు అందించిన సమాచారం ప్రకారం మకరజులా గ్రామంలోని పొలం మధ్య మహిళ మృతిచెంది ఉండటాన్ని గ్రామస్తులు గమనించారు. ఈ మేరకు హింజిలి సమాచారం అందించగా, పోలీసులు క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకొని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమితం ఎంకేసీజీ మెడికల్ కళాశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక దర్యాప్తులో మహిళను గుర్తు తెలియని దుండగులు తొలుత అత్యాచారం, ఆపై హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఐఐసీ ప్రకటించారు. నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



వార్షికోత్సవంలో ఎంపీ చంద్రశేఖర్

బరంపురం: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు సూచించారు. స్థానిక అందపసరా రోడ్డులోని రాయల్ ఫార్మాసిటికల్ కళాశాల వార్షికోత్సవాన్ని ఆయన బుధవారం ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతర ప్రారంభ గీతం ఆలపించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఏదో ఒక రంగంలో లక్ష్యం పెట్టుకొని, సాధన దిశగా ఏకాగ్రతతో సాగాలని సూచించారు. అనంతరం పాఠశాల 8వ వార్షికోత్సవం సావర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేకే విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రఫుల్లకుమార్ మహంతి, చైర్మన్ టి.ప్రకాష్ రావు, డైరెక్టర్ పీఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ ఎస్‌కే పండా, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ ముంగిట..
కమలానికి షాక్!

- బీజేడీ గూటికి బీజేపీ ఝూర్సుగుడ జిల్లా అధ్యక్షుడు
- సీఎం నవీన్ పట్నాయక్ సమక్షంలో చేరిన మంగళ్ సాహు
- పార్టీ సిద్ధాంతాలకు నీళ్లొదిలారంటూ విచారం



సీఎం నవీన్ పట్నాయక్ సమక్షంలో బీజేడీలో చేరిన మంగళ్‌సాహు

భువనేశ్వర్: ఝూర్సుగుడ ఉప ఎన్నిక పోలింగ్ మరో వారంలో జరగనుండగా.. ప్రతిపక్ష బీజేపీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీ ఝూర్సుగుడ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మంగళ్ సాహు కమలాన్ని వీడి, అధికార పక్షం బిజూ జనతాదళ్‌లో చేరారు. ఈ మేరకు బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, సీఎం నవీన్ పట్నాయక్‌తో బుధవారం ప్రత్యక్షంగా భేటీ అయ్యారు. ఈనెల 10న పోలింగ్ జరగనున్న కీలక తరుణంలో ఆయన పార్టీ ఫిరాయించడం బీజేపీ ఆశలకు గండి కొట్టినట్లయ్యింది. ముఖ్యమంత్రి నవీన్ ఆశయాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని, అందుకే తాను కాషాయ పార్టీని వీడి శంఖ దళంలో చేరాలని నిర్ణయించుకున్నానని మంగళ్‌సాహూ తెలిపారు. స్థానిక శంఖ భవన్‌లో పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ మానస్ మంగరాజ్ సమక్షంలో ఆయన బీజేడీలో చేరారు. అనంతరం నవీన్ నివాస్‌ను సందర్శించి, ప్రత్యక్షంగా భేటీ అయ్యారు.

దిగజారుడు వ్యాఖ్యలు నచ్చకే..!

మంగళ్‌సాహు బీజేపీలో దీర్ఘకాలం చురుకైన కార్యకర్తగా పలు కార్యకలాపాల్లో పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి ఝూర్సుగుడ జిల్లాశాఖ అధ్యక్ష పదవితో పలు కీలక పదవులు, హోదాల్లో బాధ్యతలు విజయవంతంగా నిర్వహించి కమలం ఉనికిని బలపరిచేందుకు కృషి చేశారు. అయితే బీజేపీ అధిష్టానం.. తమ సిద్ధాంతాలు, ఆశయాలకు నీళ్లొదిలి చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్న పరిస్థితులతో ఇమడలేక బయటకు వచ్చినట్లు విచారం వ్యక్తం చేశారు. దివంగత మంత్రి నవకిషోర్ దాస్ హత్యపై దిగజారుడు వ్యాఖ్యలు చేస్తూ ఉప ఎన్నిక పురస్కరించుకుని నియోజకవర్గ ప్రయోజనాల పరిరక్షణ, బహుముఖ అభివృద్ధి అంశాలకు ఏమాత్రం ప్రాధాన్యత కల్పించడం లేదని విచారం వ్యక్తంచేశారు. ఈ పరిస్థితుల పట్ల అసంతృప్తితో దీర్ఘకాల అనుబంధం వదులుకొని, బీజేడీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు వివరించారు.

ప్రభావం ఉండదు..

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మంగళ్‌సాహు పార్టీ ఫిరాయించి, బీజేడీలో చేరడంతో అధికార పక్షం శిబిరంలో కొత్త ఉత్సాహం ఉరకలేస్తోంది. ఈ చర్య పార్టీకి ఎంతో లాభసాటిగా ఉంటుందని, ఝూర్సుగుడ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని రాజ్యసభ సభ్యుడు మానసరంజన మంగరాజ్ హర్షం వ్యక్తంచేశారు. ఈనెల 10న జరగనున్న ఉప ఎన్నిక బీజేపీ ప్రచార తారల జాబితాలో మంగళ్‌సాహూ ఒకరు కావడం విశేషం. ఉప ఎన్నిక కోసం బీజేపీ యువ నాయకుడు టొంకొధొరొ త్రిపాఠిని రంగంలోకి దింపింది. ప్రచారం ఊపందుకుంటున్న తరుణంలో జిల్లాశాఖ అధ్యక్షుడు బీజేడీలో చేరడం బీజేపీకి ఎదురు దెబ్బగా భావిస్తున్నారు. అయితే ఈ చర్య త్వరలో జరగనున్న ఉప ఎన్నికపై ఎటువంటి ప్రభావం చూపదని కమలం వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. 23 ఏళ్ల సుదీర్ఘ బీజేడీ దుష్పరిపాలనతో నియోజకవర్గ ఓటర్లు విసిగిపోయారని, భారీ మార్పును ఆశిస్తున్నారని తెలిపారు. ఈ సంకల్పంతో బీజేపీకి ఓటరు ఆశీర్వాదం అనుకూలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



బీజేడీలో చేరిన వారితో నెక్కంటి భాస్కరరావు, ప్రతాప్ జెనా

ప్రచారంలో నెక్కంటి..

రాయగడ: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కర రావు ఝూర్సుగుడ ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు. తెలుగు ఓటర్లు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో వారిని ఆకట్టుకునే విధంగా నెక్కంటి గతంలో కూడా సంబల్‌పూర్, అతాబిర తదితర ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఇదే తరహా ఈసారి కూడా ఝూర్సుగుడ ప్రచారం కోసం బీజేడీ అధిష్టానం పిలుపు ఇవ్వడంతో ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందులో భాగంగా నియోజకవర్గం కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధి 23, 24 వార్డుల్లో బుధవారం తనదైన శైలిలో ప్రచారానికి శంఖారావం పూరించారు. 23వ వార్డులో నిర్వహించిన సభలో దివంగత మంత్రి నవకిషోర్ దాస్ కుమార్తె దీపాలి దాస్, సీనియర్ నాయకుడు ప్రతాప్ జెనా, హస్తకళలు, టెక్స్‌టైల్స్ శాఖామంత్రి రీతా సాహు, మాజీ ఎమ్మెల్యే బిభూతి బలవంతరాయ్, ఛత్రపూర్ మాజీ ఎమ్మెల్యే శుభాష్ బెహరా తదితరులు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమ, వారి ఆర్థిక, సామజిక రంగాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న బీజేడీకి మరోసారి పట్టంగట్టి, కిషోర్ దాస్‌కు నివాళిగా అర్పించాలని కోరారు. అందరి ఆదరాభిమానాలు దీపాలిదాస్‌కు ఉండాలని సూచించారు.



సమావేశంలో పాల్గొన్న బీజేడీ నాయకులు, కార్యకర్తలు

విశాలదాస్‌తో సమాలోచన..

ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా 30మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఈజేడీలో చేరారు. ప్రతాప్ జెనా సమక్షంలో చేరిన వీరికి.. నెక్కంటి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో బీజేడీ తిరిగి అధికారంలోకి రావాలంటే.. ఈ ఉప ఎన్నికలు ఎంతో, దీనికోసం అంతా కలసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే నవకిషోర్ దాస్ తనయుడు విశాల్ దాస్‌తో నెక్కంటి కొద్దిసేపు సర్క్యూట్ హౌస్‌లో భేటీ అయ్యారు. ఎన్నికల బరిలో దీపాలి దాస్ విజయానికి తన పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. వ్యూహాత్మక రచనలతో ముందుకు వెళ్తామని సూచించారు.

నేటి నుంచి రాష్ట్రపతి పర్యటన

- 3రోజులు వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గోనున్న ద్రౌపది ముర్ము
- పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్న పోలీసు యంత్రాంగం



రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం నుంచి రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ పర్యటన వరుసగా 3రోజుల పాటు కొనసాగుతుంది. ఆమె సొంత జిల్లా మయూర్‌భంజ్‌లో పర్యటించనున్నారు. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా సొంత జిల్లాలో పర్యటిస్తుండటం విశేషం. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆమె 3రోజుల రాష్ట్ర పర్యటనలో బరిపద మ రాజా శ్రీరామచంద్ర భంజ్‌దేవ్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం, సిమిలిపాల్ టైగర్ రిజర్వ్(ఎస్‌టీఆర్) సందర్శనతో సహా అనేక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అడుగడుగునా గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రదేశాలలో సుమారు 50 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. సుమారు 30 వాహనాలతో మోటర్ కేడ్‌ను రిహార్సల్ నిర్వహించారు. మూడంచెల భద్రతా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం, భారత వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో పశ్చిమబెంగాల్ లోని కలైకుండ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం.. హెలికాప్టర్‌లో గురువారం ఉదయం 10.15 గంటలకు మయూర్‌భంజ్ జిల్లా బాదంపహాడ్ హెలిప్యాడ్‌లో దిగుతారు. తొలుత ఆమె మెట్టినిల్లు గ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శిస్తారు. అక్కడ ఆమె తన భర్త దివంగత శ్యామ్‌చరణ్ ముర్ము విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తారు. అనంతరం ఈ ప్రాంతంలో ఎస్ఎల్ఎస్ ట్రస్ట్ స్కూల్‌లో కమ్యూనిటీ సెంటర్, నైపుణ్యాభివృద్ధి(స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్) నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే కొద్దిసేపు గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులతో కాలక్షేపం చేయనున్నారు.

సందర్శకులకు అనుమతి నిరాకరణ..

గురువారం సాయంత్రం సతపొటియా హత్‌బద్ర బ్రహ్మ కుమారీస్ కేంద్రం సందర్శించనున్న రాష్ట్రపతి.. వ్యసనరహిత ఒడిశా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. బొడొబొంధొ సమీపంలో 100 అడుగుల ఎత్తయిన జెండా మాస్ట్‌ను ప్రారంభించి జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. ఈనెల 5న రాయ్‌రంగ్‌పూర్ లోని నివాసానికి వెళ్లి, సుమారు 20 నిమిషాలు గడుపుతారు. అక్కడి నుంచి పండిట్ రఘునాథ్ ముర్ము గ్రామం దండ్‌బోష్, సిమిలిపాల్ టైగర్ రిజర్వ్(ఎస్‌టీఆర్)కి వెళ్లి బరిపదలో రాత్రి బస చేస్తారు. ముర్ము సందర్శన పురస్కరించుకుని సిమిలిపాల్ పులుల అభయారణ్యం ఈనెల 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు సందర్శకుల పర్యటన నివారించారు. అభయారణ్యం లోపల ఉన్న అన్ని పర్యాటక ప్రదేశాలు ఆమె పర్యటిస్తారు. ఈ నేపథ్యంలో బరేహిపాణి జలపాతం, చహలా ఫారెస్ట్ రిసార్ట్ వంటి ప్రముఖ కేంద్రాలు రాష్ట్రపతి పర్యటన కోసం సిద్ధం చేశారు. ఈనెల 6న ఉదయం 10 గంటలకు బరిపద మహారాజా శ్రీరామచంద్ర భంజదేవ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారు. ఈ కార్యక్రమం ముగియడంతో మధ్యాహ్నం 12.15 గంటలకు యూనివర్సిటీ క్యాంపస్ నుంచి బయలు దేరి తిరిగి పశ్చిమబెంగాల్ లోని కలైకుండ విమానాశ్రయానికి, అక్కడి నుంచి తిరిగి న్యూఢిల్లీకి బయలుదేరడంతో 3 రోజుల రాష్ట్ర పర్యటన పూర్తి కానుంది.

భక్తిశ్రద్ధలతో బలిజాతర ప్రారంభం



బి.సింగపూర్‌లో రాజా బలిజాతర పూజలు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి బి.సింగపూర్‌లో ప్రసిద్ధ వ్యవసాయ సంబంధిత పండగ రాజా బలాజా బుధవారం ప్రారంభమైంది. రాజుల కాలం నుంచి సంప్రదాయంగా ప్రతి మూడేళ్లకు ఒకసారి జరిగే రాజ బలిజాత్ర పూజలు మూడు నెలలు పాటు బలి ఇంటిలో జరుగుతాయని గురుమయి, బలి పూజారులు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రకాల సేకరించి, బలి బుట్టలలో నాటుతారని వెల్లడించారు. మొలకెత్తిన తరువాత బలిపూజారి సూచించిన ముహూర్తాన పూజలు చేయడంతో పాటు బుట్టలలో ఏ రకం విత్తనాలు బాగా మొలకెత్తుతాయో.. అదే పంట రానున్న కాలంలో సమృద్ధిగా పండుతాయనేది విశ్వాసంగా వివరించారు. బలిజాత్రలో భీమా దేవదేవీలకు ఘనంగా పూజలు చేస్తారు.

ముగ్గురు ఐపీఎస్ అధికారులకు పదోన్నతి



యోగేష్ బహదూర్ ఖురానియా



అరుణ్‌కుమార్ షడంగి



సుధాంశు కుమార్ షడంగి

భువనేశ్వర్: ఒడిశా కేడర్‌కు చెందిన ముగ్గురు ఐపీఎస్ అధికారులకు డైరెక్టర్ జనరల్(డీజీ)గా పదోన్నతి లభించింది. సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సుధాంశు షడంగి, అరుణ్ కుమార్ షడంగి, యోగేష్ బహదూర్ ఖురానియాలు లెవెల్-16 పే మ్యాట్రిక్స్‌లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ స్థాయికి పదోన్నతి పొందారు. వీరు ముగ్గురూ 1990 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు. యోగేష్ బహదూర్ ఖురానియా ప్రస్తుతం సెంట్రల్ డిప్యూటేషన్‌లో ఉండగా.. సుధాంశు షడంగి, అరుణ్‌కుమార్ రాష్ట్ర ఐపీఎస్ కేడర్‌లో కొనసాగుతున్నారు.

అనారోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



ప్రసంగిస్తున్న సామాజిక సంక్షేమశాఖ అధికారి బెహరా

- జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారి యజ్ఞసేని బెహరా

రాయగడ: ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే ముందుగా వైద్యులను సంప్రదించాలని జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారి యజ్ఞసేని బెహరా సూచించారు. ఇప్పటికీ మారుమూల ప్రాంతాల్లో మూఢ నమ్మకాలతో ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారని, అటువంటి వారికి అవగాహన కల్పించడం అందరి బాధ్యతని గుర్తుచేశారు. స్థానిక సమితి కార్యాలయంలో ప్రివెన్సన్ ఆఫ్ విచ్-హంటింగ్ అనే అంశంపై బుధవారం నిర్వహించిన శిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఇప్పటికీ అవగాహన లేకపోవడంతో అనారోగ్య సమస్యలు వస్తే ఆయా ప్రాంతాల్లోని మంత్రగాళ్ల ఆశ్రయిస్తూ ప్రాణాల పైకి తెచ్చుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. నేటి ఆధునిక యుగంలో ఈ తరహా ఆచార వ్యవహారాలు, మూఢ నమ్మకాలు కొనసాగించడం సరికాదన్నారు. 2013లో మూఢ నమ్మకాల వ్యతిరేక చట్టంపై సమాలోచన కలిగించాలని కోరారు. ప్రధానంగతా ఆదివాసీ ప్రాంతాల్లో తలెత్తే సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏడీఎం ధర్మానంద బెహరా, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఆరోగ్యశాఖ ఏడీఎం డాక్టర్ మమత ఛౌదరి తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల విలువైన గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి మూటలు

జయపురం: సిమెంట్ లోడు ట్రక్కులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మాచ్‌ఖండ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ట్రక్కు విడిచి, పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జొలాపుట్ సమీపంలోని సువాపుట్ గ్రామం వద్ద గుజరాత్ నుంచి వచ్చిన సిమెంట్ ట్రక్కులో గంజాయిని లోడ్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న మాచ్‌ఖండ్ పోలీసులు.. లమతాపుట్, జోలాపుట్ సిబ్బంది సహకారంతో సంయుక్తంగా దాడులు జరిపారు. అయితే పోలీసులను గమనించిన నిందితులు వాహనాన్ని వదిలి, సమీపంలోని అడవిలోకి పరుగులు తీశారు. ట్రక్కును పరిశీలించగా 120 బస్తాల్లో 502 కిలోల గంజాయిని గుర్తించారు. సరుకుతో పాటు వాహనాన్ని సీజ్ చేశారు. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.50 లక్షలకు పైగా ఉంటుందని, గంజాయిని ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు లోడ్ చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. బమాచ్‌ఖండ్ పోలీసు అధికారి డొంబురు బత్రియ, ఎస్ఐ, శంకుదొర నాయక్, లమతాపుట్ పోలీసు పంటి అధికారి చిత్త ప్రధాని, ఎస్ఐ కృష్ణ మిశ్రో, జోలాపుట్ పోలీసు అధికారి సంతోష్ పరిచా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు?

- పర్లాకిమిడిలో రాష్ట్రమంత్రి సవ్యసాచి నాయక్ ఆకస్మిక పర్యటన



సర్క్యూట్ హౌస్‌లో మాట్లాడుతున్న మంత్రి అతాను సవ్యసాచి నాయక్, పక్కన ఎంపీ సాహు

పర్లాకిమిడి: రాష్ట్ర సివిల్ సప్లైస్, కో-ఆపరేటివ్, వినియోగదారుల సంక్షేమశాఖ మంత్రి అతాను సవ్యసాచి నాయక్ జిల్లాలో బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. భువనేశ్వర్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్ ద్వారా పర్లాకిమిడి శివారులోని బెత్తగుడ మూడో బెటాలియన్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని కలెక్టర్, పౌర సరఫరాలశాఖ, ఇతర సహకార సంఘాల అధికారులతో సమావేశమయ్యారు. ఎంపీ చంద్రశేఖర సాహు, బీజేడీ జిల్లా అధ్యక్షుడు జగబంధు దాస్, పర్లాకిమిడి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి ఆయన వెంట ఉన్నారు. సమావేశం మధ్యలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, బీజేడీ సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి వచ్చి, చేరారు. అక్కడ గంటకు పైగా కలెక్టర్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం బయటకు వచ్చిన మంత్రి.. తన ఆకస్మిక పర్యటనపై ఎటువంటి ప్రకటన లేకుండా మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, దీనిపైనే చర్చ జరిగినట్లు పార్టీ వర్గాల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న సవ్యసాచి నాయక్.. ప్రత్యేక రాకకు ఇదే కారణంగా భావిస్తున్నారు. మరోవైపు ఈనెల 8, 9 తేదీల్లో 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్ గజపతి, రాయగడ జిల్లాల్లో పర్యటించనున్న దృష్ట్యా స్థానిక నేతలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాయగడ బ్లాక్ అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, ఎస్టీసీ చైర్ పర్సన్ మరియం రైతో, కాశీనగర్ బ్లాక్ చైర్మన్ బల్ల శాయమ్మ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. సాయంత్రం 4.15 గంటలకు హెలీకాప్టర్‌లో భువనేశ్వర్ తిరిగు పయనమయ్యారు.



మంత్రి సవ్యసాచి నాయక్‌తో బీజేడీ నాయకులు, అధికారులు

క్లుప్తంగా

నేటి నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు

• జేసీ మయూర్ అశోక్



విజయనగరం అర్బన్: రబీ పంట కాలంలో 2,07,300 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి రానుంది. ప్రస్తుతం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న కనీస మద్దతు ధరకు కాకుండా తక్కువకు రైతులు అమ్మకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జిల్లాజాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నను కనీస మద్దతు ధర కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాయగా మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఈ మేరకు గురువారం నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్నను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తారని తెలిపారు. మొక్కజొన్న అమ్మదలచిన రైతులు తమ రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని జేసీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

బట్టల దుకాణంలో చోరీ



చోరీ జరిగిన షాపులో పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతలో ఉన్న కేటీఆర్ రెడీమేడ్ బట్టల షాపులో మంగళవారం అర్ధరాత్రి చోరీకి జరిగినట్లు పెదమానాపురం ఏఎస్సై కాశీరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపు పైభాగాన రేకులు తొలగించి లోపలికి దిగి చీరలు, ప్యాంట్లు ఇతర వస్త్రాలతో పాటు, రూ.12వేలు దొంగిలించినట్లు యజమాని కనిమొరక తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వచ్చి షాపును పరిశీలించినట్లు చెప్పారు. క్లూస్ టీమ్‌కు సమాచారం అందించడంతో ఎస్సై మురళీమోహన్, శారద వచ్చి ఆధారాలు సేకరించినట్లు చెప్పారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.22 వేలు మాయం



బాధితుడు ఉగిరి లక్ష్మణరావు

వీరఘట్టం: తన బ్యాంకు ఖాతా నుంచి రూ.22 వేలు మాయమైనట్లు మండలకేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఉగిరి లక్ష్మణరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం యూనియన్ బ్యాంకులో ఉన్న తన ఖాతా నుంచి మంగళవారం మధ్యాహ్నం రూ.2 వేలు, రాత్రి మరో రూ.10 వేలు, అలాగే బుధవారం ఉదయం రూ.10 వేలు మొత్తం రూ.22 వేలు గుర్తు తెలియని వ్యక్తులు విత్ డ్రా చేసినట్లు ఆయన స్థానిక యూనియన్ బ్యాంకులో ఫిర్యాదు చేశారు. దీంతో బ్రాంచ్ మేనేజర్ వెంటనే ఆయన ఖాతాను బ్లాక్ చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని బీఎం తెలిపారు. బాధితుడి ఆధార్ కార్డు ఆధారంగా కస్టమర్ సర్వీసు సెంటర్‌లో ఎవరో విత్ డ్రా చేసి ఉంటారని ఆయన తెలిపారు.అయితే ఈ బ్యాంకులో గతంలో కూడా కొందరి అకౌంట్ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు విత్ డ్రాలు చేసిన సందర్భాలు ఉన్నాయి.

ఇరువర్గాల కొట్లాట



చికిత్స పొందుతున్న పెంటంనాయుడు

పార్వతీపురం: భూమి హక్కుల విషయం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. దీనిపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం బురద వెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స పెంటంనాయుడు, వరుసకు పెదనాన్న కుమారులు శ్రీహరినాయుడు తదితరుల మధ్య పదేళ్లుగా భూమి హక్కులపై తగువులు జరుగుతున్నాయి. భూమి హక్కుల విషయమై తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఇరువర్గాల వారిని పిలవగా కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ 265/12లో 0–10 సెంట్ల భూమిని ఆక్రమించుకున్నారని పెంటంనాయుడు రెవెన్యూ అధికారుల ఎదుట వివరించగా, ఆ భూమిని పెంటంనాయుడు గతంలో విక్రయించాడని శ్రీహరినాయుడు తెలిపారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి కొట్లాటకు దారితీసింది. ఈఘటనలో శ్రీహరినాయుడు,సత్యంనాయుడు, ఈశ్వరరావు తదితరులు పెంటంనాయుడిని పలుచోట్ల గాయపరిచారు. గాయపడిన పెంటంనాయుడును కుటుంబసభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

అంతర్జాతీయ సేవలకు శ్రీకారం

• సింగపూర్, బ్యాంకాక్ విమాన టిక్కెట్ బుకింగ్ ప్రారంభం
• జూన్ 3నుంచి ప్రయాణికులకు అందుబాటులో సేవలు





భువనేశ్వర్ అంతర్జాతీయ విమానాశ్రయం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రజలు ఆగ్నేయ ఆసియా నగరాలకు సరసమైన ధరతో ప్రయాణించడానికి సింగపూర్, బ్యాంకాక్ లకు ప్రత్యక్ష విమానయాన టిక్కెట్ బుకింగ్‌ను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం ప్రారంభించారు. దీంతో రాష్ట్ర ప్రజలకు అంతర్జాతీయ విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. ఈ ఏడాది జూన్ 3నుంచి ఇండిగో ఎయిర్ లైన్స్ సింగపూర్, బ్యాంకాక్ లకు నేరుగా అంతర్జాతీయ విమాన సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇటీవల దుబాయ్‌కి డైరెక్ట్ ఫ్లైట్ టికెటింగ్‌ను సీఎం ప్రారంభించిన విషయం తెలిసిందే. భువనేశ్వర్ నుంచి దుబాయ్‌కి ఇండిగో ప్రారంభ విమానాల కోసం ఆన్‌లైన్ రిజర్వేషన్లు ప్రోత్సాహకరమైన ప్రతిస్పందనను పొందాయన్నారు. ఈ చొరవ ఒడిశా యువతకు ఉద్యోగ అవకాశాలను ప్రోత్సహిస్తుందని, రాష్ట్ర పర్యాటక అవకాశాలను విస్తరిస్తుందని ప్రకటించారు. రాష్ట్రంలో ఐటీ, ఐటీఈఎస్ రంగాలకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. గత కొన్నేళ్లుగా ఒడిశాలో విమానయాన ట్రాఫిక్ అపారమైన వృద్ధిని సాధించిందన్నారు. దేశీయ విమాన కనెక్టివిటీ గుర్తించదగిన మెరుగుదల సాధించిందని, ప్రజల ఆకాంక్షలను తీర్చడానికి ప్రపంచస్థాయి గమ్యస్థానాల మధ్య ప్రత్యక్ష అంతర్జాతీయ విమాన కనెక్టివిటీని కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం సహాయ సహకారం అందించి ప్రోత్సహించిందని వెల్లడించారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు విమానయాన ప్రయాణ నిడివి రెండు నుంచి రెండున్నర గంటల్లోనే చేరుకోవచ్చని వివరించారు. సింగపూర్, బ్యాంకాక్‌లకు ప్రత్యక్ష విమానయాన టికెట్ బుకింగ్ ప్రారంభోత్సవంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా, వాణిజ్య, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ఉషా పాఢి, సీఎం 5టీ కార్యదర్శి వీకే పాండియన్, ఒడిశా ప్రభుత్వ సీనియర్ అధికారులు, ఇండిగో అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష అంతర్జాతీయ విమానయాన సేవలు

స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ గమ్యస్థానాలైన దుబాయ్, సింగపూర్, బ్యాంకాక్ మధ్య ప్రత్యక్ష అంతర్జాతీయ విమానసేవల వేళలు, ప్రయాణ నిడివి, చార్జీల వివరాలు ఇలా ఉన్నాయి.

భువనేశ్వర్-దుబాయ్ మార్గం					
విమానాశ్రయం	సమయం (గంటల్లో)	గమ్యం	సేవల రోజులు	ప్రయాణ సమయం	ప్రారంభ ఛార్జీ(రూ.)
భువనేశ్వర్	సా.6.30	దుబాయ్	సోమ, బుధ, శుక్ర	4.45 గంటలు	రూ.10,000లు(ఒక వైపు), రూ.20,000లు(రౌండ్ ట్రిప్)
దుబాయ్	ఉ.11:25	భువనేశ్వర్		4:25 గంటలు	

భువనేశ్వర్-సింగపూర్ మార్గం					
విమానాశ్రయం	సమయం (గంటల్లో)	గమ్యం	సేవల రోజులు	ప్రయాణ సమయం	ప్రారంభ ఛార్జీ(రూ.)
భువనేశ్వర్	ఉ.06.25	సింగపూర్	మంగళ, శని	4.10 గంటలు	రూ.7,500లు(ఒక వైపు) రూ.15,000(రౌండ్ ట్రిప్)
సింగపూర్	మ.2.10	భువనేశ్వర్	మంగళ, శని	4.10 గంటలు	

భువనేశ్వర్-బ్యాంకాక్ మార్గం					
విమానాశ్రయం	సమయం (గంటల్లో)	గమ్యం	సేవల రోజులు	ప్రయాణ సమయం	ప్రారంభ ఛార్జీ (రూ.)
భువనేశ్వర్	సా.4.50	బ్యాంకాక్	మంగళ, శని	2.50 గంటలు	రూ.7,500లు(ఒక వైపు) రూ.15,000లు(రౌండ్ ట్రిప్)
బ్యాంకాక్	ఉ.5.35	భువనేశ్వర్	బుధ, ఆది	2.50 గంటలు	

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వారపు సంత భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సరక

• మంత్రి జగన్నాథ సరక

రాయగడ: ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సత్ఫలితాలిస్తున్నాయని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లాలోని మునిగుడ సమితి హటో మునిగుడలో నిర్మించిన వారపుసంత భవనాల సముదాయాన్ని ఆయన మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ) చైర్మన్ అనసూయ మాఝి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, బీడీఓ సదాశివ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆదరాభిమానాలు ఉన్నంతవరకు రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తోందని, ఆయన పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉంటారని వివరించారు. అనంతరం హటో మునిగుడలో కొత్తగా నిర్మించిన మిషన్‌శక్తి భవనాన్ని ప్రారంభించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో బుధవారం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలియజేసిన మేరకు ఆయా ప్రమాద సంఘటనల వివరాలిలా ఉన్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: మోహన్‌రావు మృతదేహం



భామిని:మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అమ్మనరావు

కురుపాం మండలం గుమ్మ గ్రామానికి చెందిన నాందేడ మోహన్‌రావు (40) మామిడి పళ్ల కోసం చెట్టు ఎక్కి కోస్తుండగా, కొమ్మ విరిపోవడంతో జారిపడ్డాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు మోహన్‌రావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భద్రగిరి సీహెచ్‌సీలో పోస్టు మార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

విద్యుత్ తీగలు తగిలి పశువుల కాపరి..

చీపురుపల్లి మండలంలోని ఇటకర్లపల్లి పంచాయతీ పరిధి పోతాయవలస గ్రామానికి చెందిన యువకుడు సుబుద్ధి రామారావు(30) గ్రామానికి సమీపంలో పశువులు మేపుతుండగా విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు చేతికి తగలడంతో షాక్ కొట్టి మృతి చెందాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న పెద్ద కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

భామిని మండలం పసుకుడికి చెందిన రవి గౌడో(33) మంగళవారం రాత్రి భామిని నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి ప్రమాదానికి గురై రోడ్డుకు తల ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు. వెనుకగా వస్తున్న గ్రామస్తులు ప్రమాదాన్ని గుర్తించి 108 అంబులెన్స్‌లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్య సేవలు అందిస్తుండగా మృతి చెందాడు. బత్తిలి ఎస్సై యతిరాజుల అమ్మనరావు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

రైలు ఢీ కొని గుర్తు తెలియని మహిళ..

చెన్నై నుంచి హౌరా వెళ్లే రైల్వే మార్గంలో కొత్తవలస మండలం మంగళపాలెం జంక్షన్ వద్ద సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మహిళ రైల్వే ట్రాక్ దాటుతుండగా విశాఖ వైపు వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టింది. దీంతో ఆమె శరీరభాగాలు పూర్తిగా నుజ్జు నుజ్జయి చిందర వదనగా పడిపోవడంతో చనిపోయిన మహిళను గుర్తుపట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. జీఆర్‌పీ ఎస్సై టి.కామేశ్వర్రావు శవపంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి మృతదేహం భాగాలను విజయనగరం రైల్వే ఆస్పత్రికి తరలించారు.

ఆశ్రమ విద్యార్థిని ఆదుకున్న ఆరోగ్యశ్రీ



ఆపరేషన్ అనంతరం డిశ్చార్జ్ అయిన విద్యార్థి

• బాలుడి గుండెకు శస్త్రచికిత్స చేసి కాపాడిన వైద్యులు
• ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

సీతంపేట: బిడ్డ బాగా చదువుకోవాలని స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 4వ తరగతిలో చేర్పించారు తల్లిదండ్రులు. ఇక్కడే భోజన, వసతి సౌకర్యాలు ఉండడంతో బాగా చదువుకుంటున్నాడు. ఇంతలో పిడుగులాంటి సమాచారం తెలియడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఆరోగ్య శ్రీ అండగా నిలిచింది. వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం చినఖేర్జ గ్రామానికి చెందిన పువ్వల కృష్ణమూర్తి అనసూయలకు ముగ్గురు పిల్లలు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆ కుటుంబం కువ్వల యశ్వంత్‌ను సీతంపేటలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 4వ తరగతిలో చేర్పించింది. తమ కుమారుడు ఆరోగ్యంగా ఉండి అందరితో కలివిడిగా ఉంటూ చదువులో కూడా మంచి తెలివితేటలు ప్రదర్శించడంతో తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారు. కొద్ది రోజుల కిందట డెంగీ జ్వరం రావడంతో పాఠశాల సిబ్బంది స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అసలు విషయం బయట పడింది. గుండెకు రంధ్రం ఉందని వెంటనే అవసరమైన శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు. వెంటనే పాఠశాల సిబ్బంది అప్రమత్తమై తల్లిదండ్రులకు సమాచారమిచ్చి శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

అక్కడ వైద్య పరీక్షల అనంతరం ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. విశాఖపట్నంలోని స్టార్ పినాకిల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆ ఆస్పత్రిలో గత నెల 25న చేసిన ఆపరేషన్ సక్సెస్ అయింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.చంద్రరావుతో పాటు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు బాలుడి పరిస్థితిని పర్యవేక్షించారు. విద్యార్థికి ఆపరేషన్ విజయవంతమైందని తెలుసుకున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదంటూ విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆ విద్యార్థిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

• పార్వతీపురం మన్యం కలెక్టర్ నిశాంత్ కుమార్



ఎగువ తాడికొండ అంగన్‌వాడీ కేంద్రం గడపలో కూర్చుని రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

గుమ్మలక్ష్మీపురం: విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఈమేరకు బుధవారం ఆయన మండలంలోని తాడికొండ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఎగువ తాడికొండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా అంగన్వాడీ కేంద్రం గడపలోనే కూర్చుని రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డుల నమోదుకు వాస్తవ వివరాలకు తేడాలు గమనించిన కలెక్టర్ సిబ్బందిని ప్రశ్నించారు. ప్రసవించిన తల్లుల వివరాలు లేకపోవడం, తప్పులు నమోదు చేయడం, ప్రసవించి నాలుగు రోజులైనప్పటికీ యాప్‌లో నమోదు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇచ్చిన వివరాలలో తేడాలు గమనించిన కలెక్టర్ ఇకపై ఇదే విధంగా విధులు నిర్వహిస్తే తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సచివాలయం సిబ్బంది, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎం, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామంలో రక్తహీనత గల పిల్లలు, తల్లుల వివరాలు తెలుసుకుని వారి సంఖ్య తగ్గించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన తల్లులతో మాట్లాడుతూ ఐరన్ మాత్రలు, పౌష్టికాహార పదార్థాల కిట్, గుడ్లు సకాలంలో ఇస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు.

ఆహార పదార్థాల తయారీలో అప్రమత్తం

ఆరోగ్యంపై తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారా? అని ఆరా తీశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని వంటగది, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని, ఆహార పదార్థాల తయారీలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, సిబ్బంది హాజరు పట్టీ, ప్రసవం జరిగిన వివరాలు, చికిత్స పొందుతున్న వారి వివరాలు పరిశీలించారు. ఆయన వెంట జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి కె.విజయగౌరి, తహసీల్దార్ జె.రాములమ్మ, ఎంపీడీఓ సాల్మన్‌రాజు ఉన్నారు.

టీటీడీ చైర్మన్‌కు ఘనంగా స్వాగతం

• కల్యాణ మండపం సౌకర్యాలపై వినతి



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుటుంబసభ్యులు

చీపురుపల్లి: టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం రాత్రి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చీపురుపల్లి పట్టణంలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణలు స్థానిక టీటీడీ కల్యాణ మంటపంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దివంగత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో టీటీడీ కల్యాణ మంటపం నిర్మాణం జరిగిందని ప్రస్తుతం అక్కడ వసతి సమస్యతో పాటు ఇతర ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేకంగా నిధులు కేటాయించి టీటీడీ కల్యాణ మండపాన్ని ఆధునీకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ఉన్నారు.

సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 1 నుంచి తిరుపతి వేదికగా జరుగుతున్న పోటీల్లో 100 మీటర్ల పరుగు పోటీలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆర్.గణేష్ బంగారు పతకం దక్కించుకోగా.. జావెలిన్ త్రోలో జి.ఈశ్వరరావు బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా 800 మీటర్ల పరుగు పోటీలో పి.సాయి రజత పతకం, 100 మీటర్ల పరుగు పోటీలోబి.లక్ష్మి, హైజంప్‌లో జి.లక్ష్మి కాంస్య పతకాలు దక్కించుకున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను ఆయన అభినందించారు.

జాతీయస్థాయి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: సర్వేజనా సుఖినోభవంతు సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో మట్టిలో మాణిక్యాలైన విద్యావంతులు, ఉపాధ్యాయులు, సమాజ సేవకులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు తదితర ప్రతిభావంతులకు జాతీయస్థాయి పురస్కారాలు అందజేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఐఎస్ఎస్.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాభూషణ్, సేవా భూషణ్, ప్రతిభా భూషణ్ 2023 జాతీయస్థాయి పురస్కారాలను అందజేసి, వారి సేవలను, ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో మే 21న ఆదివారం హైదరాబాద్‌లో సంస్థ ఆరో వార్షికోత్సవంలో పురస్కారాలను అందజేస్తామన్నా రు. ఆసక్తి, అర్హత కలిగిన వారందరూ 9652347207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం



వి.రాకేష్

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఉంటున్న శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీకి చెందిన వి.రాకేష్(21) బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సాయంత్రం 6.30 గంటల సమయంలో రాకేష్ తోటి విద్యార్థులతో ఈ నెల 2న వసతిగృహంలోని తన గదికి వెళ్తానే ఒక్కసారిగా సెకండ్ ఫ్లోర్ నుంచి కిందకు దూకాడు. దీంతో అతనిని వెంటనే ట్రిపుల్‌ఐటీ ఆవరణలోనే ఉన్న ఆస్పత్రికి, అక్కడి నుంచి ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. రాకేష్‌ది విజయనగరం జిల్లాలోని గొలిజం స్వగ్రామం. మూడు రోజులుగా అతను ముభావంగా ఉంటున్నాడని తోటి విద్యార్థులు ఫ్యాకల్టీకి చెప్పడంతో మంగళవారం రెండు గంటల సేపు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నెల 4న విద్యార్థులందరూ ఇంటికి వెళ్తుండగా, ఇంతలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారమా? ఇంకేమైనా కారణముందా అనే దానిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు

బొబ్బిలి: మండలంలోని కోమటి పల్లి వద్ద ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో చిలకల పల్లికి చెందిన చింతాడ అప్పలస్వామి, కలువరాయికి చెందిన వెంపలి ఈశ్వరమ్మ గాయపడ్డారు. వారిలో అప్పలస్వామిని మెరుగైన చికిత్స కోసం బొబ్బిలి సీహెచ్‌సీ నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

బైక్‌ను కారు ఢీకొని మరో ఇద్దరికి..

బొండపల్లి: మెంటాడ మండలం, జీడివలస గ్రామానికి చెందిన ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మండలంలోని గరుడుబిల్లి జంక్షన్ జాతీయ రహదారిపై విజయనగరం నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. దీంతో వారిని విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి 108 వాహనంలో చికిత్స కోసం తరలించారు.





● నేత్రపర్వం.. ఊయల ఉత్సవం

జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీలో నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామి ఊయల ఉత్సవం బుధవారం నేత్రపర్వంగా సాగింది. ముందుగా శ్రీభూనీళా సమేత స్వామివారి ఉత్సమూర్తులను మండపానికి మేళతాళాలతో తీసుకొచ్చి ప్రత్యేకంగా రూపొందించిన ఊయల సింహాసనంపై ఉంచి పుష్పార్చనలు చేశారు. అర్చకుడు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో రకరకాల పుష్పాలతో అలంకరింపచేసి వేదమంత్రాల నడుమ స్వామికి సహస్రనామార్చనలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు కీర్తనలు ఆలపించగా, మరికొందరు కోలాట ప్రదర్శన చేశారు. – శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

అనధికార తరగతులు నిర్వహిస్తే చర్యలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో సెలవుల్లో అనధికారికంగా తరగతులు నిర్వహిస్తే (ఫెయిలైన విద్యార్థులకు మినహా) కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు హెచ్చరించారు. బుధవారం నగరంలో తనిఖీలు చేపట్టగా కొత్తబ్యాచ్‌లకు తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలలకు తాళాలు వేశారు. భవిష్యత్తులో పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తప్పవని కళాశాలల ప్రతినిధులకు హెచ్చరించారు. జిల్లాలో అనధికార, గుర్తింపులేని ఇంటర్మీడియట్ కళాశాలలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

విజయగణపతికి దీపాల సేవ



విజయగణపతికి అష్టోత్తర శత దీపాల సేవ

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయంలో బుధవారం అష్టోత్తర శత దీపాల సేవ నిర్వహించారు. అర్చకులు పెంట నగేష్‌శర్మ, శ్రీధర్‌శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ అయ్యేలా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. బుధవారం తన కార్యాలయంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు, జడ్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వాహన ప్రమాద కేసుల్లో కక్షిదారులకు సత్వరమే న్యాయం అందడానికి లోక్ అదాలత్ మంచి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. సమయం, డబ్బు వృథా కాకుండా సత్వర న్యాయం లభిస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయితే అపీలుకు అవకాశం లేనందున కేసుకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సమావేశంలో ఎస్పీలు రాధిక, విక్రాంత్ పాటిల్, జిల్లా ఫ్యామిలీ కోర్టు అదనపు జిల్లా జడ్జి భాస్కరరావు, ఎస్సీ, ఎస్టీ కోర్టు అదనపు జిల్లా జడ్జి ఫణికుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనూరాధ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, ప్రభుత్వ న్యాయవాది వినయ్ భూషణ్‌రావు, స్టాండింగ్ కౌన్సిల్స్ లక్ష్మి, మంచు జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత చదువు' రెండో జాబితా ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత విద్య కోసం రెండో ఫేజ్ కింద ఎంపికైన 93 మంది విద్యార్థుల జాబితాను జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)సీ ప్రకారం 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు నమోదు చేసుకుని లాటరీ ద్వారా ఎంపికైన విద్యార్థులు ఈ నెల 9లోగా పాఠశాలల్లో విధిగా అడ్మిషన్లు పొందాల్సి ఉంది. ఒకవేళ నిర్దేశించిన తేదీలోగా ప్రవేశం పొందకపోతే సదరు విద్యార్థుల అడ్మిషన్ రద్దు కానుంది.

ఆ ఫీజులు ప్రభుత్వమే భరిస్తుంది..

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు ప్రవేశాలు పొంది, ఉచితంగా చదువుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే తొలి విడత ప్రవేశాలు పూర్తయ్యాయి. తాజాగా రెండో విడత ఎంపికైన విద్యార్థుల జాబితా మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో నోటీసు బోర్డులో సిద్ధంగా ఉన్నాయి. ఈ చదువుకు అవసరమైన ఫీజులను ఆయా పాఠశాలలకు ప్రభుత్వమే చెల్లించనుంది. ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది.

వెబ్‌పోర్టల్లోనూ జాబితా: డీఈఓ

ఉచిత చదువు కోసం ఎంపికైన విద్యార్థుల జాబితాను ఎంఈవో కార్యాలయాలతో పాటు సీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో అందుబాటులో ఉంచామని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య బుధవారం తెలిపారు. ఎంఈవోలు, హెచ్ఎంలు ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం చేరవేసేలా చొరవ తీసుకోవాలని సూచించారు.

జాబు అని నమ్మితే.. జేబు ఖాళీయే..!



ఇలాంటి ఆఫర్స్‌ను నమ్మవద్దు..



పార్ట్‌టైం జాబ్స్, వర్క్ ఫ్రం హోమ్ అంటూ నమ్మబలికేవారి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి. తెలియని లింక్స్ క్లిక్ చేయడం, తెలియనివారితో టెలిగ్రామ్, వాట్సాప్ వంటి యాప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని ఇలాంటి ఆఫర్స్ నమ్మి డబ్బులు పంపించకూడదు.
– జి.ఆర్.రాధిక, ఎస్పీ, శ్రీకాకుళం జిల్లా

● వర్క్ ఫ్రం హోమ్, పార్ట్‌టైం జాబ్ అంటూ మోసగిస్తున్న కేటుగాళ్లు
● వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా ఫోన్లకు లింకులు
● అత్యాశకు పోయి సైబర్ వలలో చిక్కుకుంటున్న యువత
● అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : మీరు ఎక్కడికీ వెళ్లకుండా సులువుగా ఇంటి వద్దే ఉంటూ జాబ్ చేయండి.. ప్రతి నెలా వేలాది రూపాయలు సంపాదించండి.. వర్క్ ఫ్రం హోమ్.. పార్ట్‌టైం జాబ్ చేస్తూ లక్షలు సంపాదించండి.. ఇందుకు చేయాల్సిందల్లా కింద ఉన్న లింక్ క్లిక్ చేయడమే.. ఈ తరహా మెసేజులు నమ్మి మోసపోతున్న వారి సంఖ్య జిల్లాలో ప్రతి నెలా పెరుగుతోంది. ఉద్యోగం అంటే ఎవరికైనా ఆశే. సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశకుపోయిన యువకులు సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కుకొని మోసపోతున్నారు. ఫోన్‌ల ద్వారా వారు పంపించే సాధారణ, వాట్సాప్, టెలిగ్రామ్ సందేశాల్లోని లింక్‌లు ఓపెన్ చేసి వారు చెప్పిందల్లా చేసి బ్యాంకు ఖాతాల నుంచి సొమ్మును యూపీఐ, గూగుల్‌పే, ఫోన్‌పే తదితర ద్వారా ట్రాంజెక్షన్ చేసి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. నిన్నటికి నిన్న కొత్తూరు మండలవాసి రూ.1.94 లక్షలు ఇలా నమ్మే మోసపోయారు. 2022లో ఈ తరహా కేసులు జిల్లాలో మూడు నమోదు కాగా.. ఈ ఏడాది నాలుగు నెలల వ్యవధిలోనే మూడు కేసులు నమోదు కావడం గమనార్హం. మొత్తంగా బాధితుల వద్ద నుంచి రూ.20 లక్షల వరకు సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. వర్క్‌ఫ్రం హోం, పార్ట్ టైం జాబ్‌లంటూ ఎవరైనా నమ్మబలికినా యువత మోసపోకూడదని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు ఉన్నతాధికారులు సూచిస్తున్నారు..

సైబర్ అలర్ట్

కొన్ని ఘటనలు పరిశీలిస్తే..

● 2022లో జె.ఆర్.పురం పీఎస్ పరిధిలో రూ.1,19,000, లావేరు పీఎస్ పరిధిలో రూ.4,55000, టెక్కలి పీఎస్ పరిధిలో రూ. 1,80,000లు సైబర్ నేరగాళ్లు యువకుల బ్యాంకు ఖాతాల నుంచి దోచుకున్నారు.
● 2023లో పోలాకి పీఎస్ పరిధిలో జనవరి 23న రూ.25,000, ఎచ్చెర్ల పీఎస్ పరిధిలో ఫిబ్రవరిలో రూ.10,23,000. ఈ నెల(మే) 1న కొత్తూరు పీఎస్ పరిధిలో రూ.1,94,000 మోసపోయామంటూ ఫిర్యాదులు చేశారు.

చిక్కుకునేది చదువుకున్న వారే..

ముంబైలోని ఓ కంపెనీ తరఫున ప్రాజెక్టు మేనేజరుగా ఉన్న ఆయన కొత్తూరులో వర్క్‌ఫ్రం హోమ్ విధులు నిర్వర్తిస్తూ ఇలాంటి ఉచ్చులో చిక్కుకున్నాడు. అరబిందో కంపెనీలో పనిచేస్తున్న మరో ఆయన ఎచ్చెర్ల పీఎస్ పరిధిలో మోసపోయాడు.. ఇలా చెప్పుకుంటూ పోతే అంతా చదువుకున్నవాళ్లే..

మోసం చేస్తారిలా..

ఫోన్‌కు సాధారణ సందేశాల ద్వారా కొన్ని లింక్‌లను పంపిస్తారు. అవి తెలియకుండానే మనం ఓపెన్ చేస్తాం. ఆ లింకుల్లో అర్జెంట్ ఓపెనింగ్ ఫర్ జాబ్ ఇంటర్వ్యూ, యూ కెన్ వర్క్ ఫ్రం హోం సేలరీ అప్ టు రూ.18,000. మినిమమ్ 2 మంత్స్ ఎక్స్‌పీరియన్స్, కాల్ ఆర్ క్లిక్ .. అంటూ ఓ లింక్ పంపుతారు. ఆ లింకులోనే ఫోన్ నెంబరు ఉంటుంది. మనం ఫోన్ చేసినా.. ఆ లింక్ ఓపెన్ చేసినా.. ఇక అంతే.. వారు లైన్లోకి వచ్చి మీరు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రాసెస్ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంటేషన్ ఫీజు అంటూ దఫదఫాలుగా మీకు శఠగోపం పెట్టేస్తారు.

● మరికొందరు ఆ లింక్ నుంచి ఎనీడెస్క్ యాప్ ద్వారా మన బ్యాంకు ఖాతాలు, యూపీఐ పిన్‌లు, ఎంపిన్‌లు తదితర డేటా అంతా చోరీ చేసి సొమ్మును ఖాళీ చేస్తారు.
● టెలిగ్రామ్ యాప్ ద్వారా వర్క్ ఫ్రం హోం అంటూ.. ఎక్కువ మందితో గ్రూపు క్రియేట్ చేసి.. నాలుగైదు టాస్క్‌ల ద్వారా అమౌంటును పంపిస్తే అదనంగా ఒకేసారి ఎక్కువ మొత్తంలో సెటిల్ చేస్తామని చెబుతారు.



మనల్ని నమ్మించడానికి గ్రూపులో వాళ్లు పంపిన అమౌంట్, వారికి అదనంగా వచ్చిన క్రెడిట్ అమౌంట్‌లు స్క్రీన్ షాట్‌లు గ్రూప్ హిస్టరీలో పెడతారు. టాస్క్‌లు పూర్తిచేయకుండా మధ్యలో ఆగిపోతే అమౌంట్ రీఫండ్ చేయమని ముందుగా కండిషన్ పెడతారు. మొదట ఓ రూ. 2 వేలు పంపించామనుకోండి.. రూ.2,800 మన ఖాతాలో క్రెడిట్ చేస్తారు. తర్వాత మరో ఐదు వేలు అంటారు. కానీ రిటర్న్ క్రెడిట్ చేయరు. ఏమని అడిగితే టాస్క్‌లు పూర్తవ్వాలంటారు. రూ. 28 వేలు, రూ.65 వేలు, రూ.1.45లక్షలు.. ఇలా పెంచుకుంటూ పోతారు. తీరా అమౌంట్ పంపించేశాక గ్రూప్‌లో హిస్టరీ రిమూవ్ చేసేస్తారు. మన ఫోన్ నెంబర్ బ్లాక్ చేస్తారు. వారితో కమ్యూనికేషన్ ఉండదు. అప్పటికి గాని మనకు అర్థమవ్వదు మోసపోయామని.

తొందరగా ఫిర్యాదు చేస్తే మేలు..

ఇలాంటి నేరాలు జరిగేటప్పుడు తక్షణమే 1930కు డయల్ చేసి ఫిర్యాదు చేస్తే మంచిది. వారి అకౌంట్లు బ్యాంకు వారు ఫ్రీజ్‌లో పెడతారు. ఖాతా నంబర్లు, ఏటీఎం పిన్ నంబర్లు అన్నీ బ్లాకులో పెడతారు. నిందితులు, వారి అకౌంట్లు ట్రేస్ అయ్యాక విచారణ పూర్తి చేసి వారి వద్ద సొమ్ము రికవరీ చేసి వీరికి జమ చేస్తారు. (కొత్తూరు బాధితుడు మూడు అకౌంట్లలో 77,000 (ఐసీఐసీఐ), 45,000 (సిటీ బ్యాంకు), 72,000(హెచ్‌డీఎఫ్‌సీ) పంపించాడు. ఐసీఐసీఐ బ్యాంకు వారు పంపించిన అమౌంట్‌ను మరణా క్రెడిట్ చేసి అవి వాడుకోవడానికి లేకుండా ఫ్రీజ్ చేశారు.

వసతిగృహాలపై నమ్మకం కల్పించండి

● వార్డెన్ల సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వసతి గృహ అధికారులు (వార్డెన్లు) సమయపాలన పాటించాలని, హాస్టళ్లపై తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ వసతి గృహ అధికారులతో జాతీయ ఆహార భద్రత చట్టం–2013పై సమీక్ష నిర్వహించారు. వసతి గృహాల్లో చేపడుతున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు మంచి భోజనంతో పాటు మెరుగైన విద్య అందించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 3 నాటికి వసతి గృహాల వాటర్ ట్యాంక్‌లు పూర్తి స్థాయిలో శుభ్రపరచి ఫొటోలతో సహా నివేదికలు సమర్పించాలన్నారు. విద్యార్థులకు మంచి ఆహారం అందించేలా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు బాధ్యత వహించాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం వసతి గృహాల్లో చేపడుతున్న పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్మీడియెట్ ఫలితాలపై వసతి గృహాల వారీగా సమీక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన టెక్కలి, పొందూరు కళాశాలల బాలికల వసతి గృహాల అధికారులను అభినందించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి ఆర్.గడ్డెమ్మ, శ్రీకాకుళం, పలాస సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న జీఎస్‌టీ డిప్యూటీ కమిషనర్



శైలజారాణికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర వస్తుసేవల పన్ను(జీఎస్‌టీ) విభాగ డిప్యూటీ కమిషనర్ శైలజారాణి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వి.హరి సూర్యప్రకాశరావు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో జీఎస్‌టీ అధికారులు, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి సూర్యనారాయణస్వామివారి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటల నుంచి ఆలయ అనివెట్టి మండపంలో జరుగుతుందని ఈవో వి.హరిసూర్యప్రకాశ్ తెలిపారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో పాటు గ్రామ పెద్దల పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని, రామతీర్థం దేవస్థానం ఈవో కిషోర్‌కుమార్ పర్యవేక్షించనున్నారని పేర్కొన్నారు.

పండగకు వచ్చి వెళ్తుండగా..

● రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి
● తిమడాంలో విషాదఛాయలు




ఘటనపై ఆరా తీస్తున్న ఎస్‌ఐ సింహాచలం

నరసన్నపేట: గడ్డెయ్యపేట కూడలి సమీపంలో మందాలమ్మ గుడి వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలం తిమడాంకు చెందిన కింజరాపు సావిత్రి (36) మృతి చెందింది. జమ్ములో గ్రామదేవత పండగకు వచ్చి బంధువుల ఇంట్లో భోజనం అనంతరం సమీప బంధువుతో కలిసి స్కూటీపై స్వగ్రామం తిమడాంకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎదురుగా వేగంగా వస్తున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అయితే ప్రమాదానికి కారణమైన ఆటో వెళ్లిపోవడంతో పోలీసులు ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనం వెనక కూర్చున్న సావిత్రి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈమె రోజు వారీ కూలీ. భర్త శిమ్మయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు వెంకటసాయి, ప్రియా ఆనంద్ ఉన్నారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే తిమడాంలో విషాదం అలుముకుంది. ఘటనా స్థలాన్ని నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం పరిశీలించారు. స్కూటీ నడిపిన వ్యక్తిని విచారించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకం



ప్లేస్‌మెంట్ ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకమని సెట్‌శ్రీ సీఈవో ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఉద్యోగ విజయోత్సవ వేడుక నిర్వహించి ప్లేస్‌మెంట్లను సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉద్యోగ నియామక ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మేధా, ఎం.నాగలక్ష్మి, టి.రాజశేఖర్, ఎల్.తరుణ్, పి.భవానీ, బి.ఆర్యా, కె.దుర్గా సాయిరాం, కె.తరుణ్‌సాయి, ఎస్.ఉదయ్‌కిరణ్‌లు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. వార్షిక వేతనం రూ.3 లక్షలు నుంచి రూ.2.4 లక్షలు లభించనుంది. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రారంభంలో తక్కువ వేతనం లభించినా నైపుణ్యం, అనుభవం ఆధారంగా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. డిప్లమా కోర్సులో చేరినప్పటి నుంచి ప్రయోగాత్మక విద్యకు, ఇంటర్న్‌షిప్‌కు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, ఏఎస్ఆర్ జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకుల కోసం ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 4 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 7993340407, 9553410809 నంబర్లకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

నూజివీడు :

ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఉంటున్న శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీకి చెందిన వి.రాకేష్(21) బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సాయంత్రం 6.30 గంటల సమయంలో రాకేష్ తోటి విద్యార్థులతో ఈ2 వసతి గృహంలోని తన గదికి వెళ్తూనే ఒక్కసారిగా సెకండ్ ఫ్లోర్ నుంచి కిందకు దూకాడు. దీంతో అతనిని వెంటనే ట్రిపుల్ ఐటీ ఆవరణలోనే ఉన్న ఆసుపత్రికి, అక్కడి నుంచి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. రాకేష్‌ది విజయనగరం జిల్లాలోని గొలిజం స్వగ్రామం. మూడు రోజులుగా అతను ముభావంగా ఉంటున్నాడని తోటి విద్యార్థులు ఫ్యాకల్టీకి చెప్పడంతో మంగళవారం రెండు గంటల సేపు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈనెల 4న విద్యార్థులందరూ ఇంటికి వెళ్తుండగా, ఇంతలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు.

కుప్పకూలిన బాహుదా వంతెన

● గ్రానైట్ లారీ వెళ్తుండగా ఘటన
● స్వల్ప గాయాలతో బయటపడిన డ్రైవర్, క్లీనర్
● తప్పిన పెను ప్రమాదం
● నిలిచిపోయిన రాకపోకలు



ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్/ఇచ్ఛాపురం: రాత్రంతా ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల్లో గడిపిన ప్రజలు బుధవారం ఉదయం 5 గంటల సమయంలో బాహుదానదిలో స్నానం చేసేందుకు వస్తున్న వేళ.. ఒకటి, రెండు వాహనాలు వంతెనపై ప్రయాణిస్తున్న సమయంలో పెద్దగా శబ్దం చేస్తూ ఉన్నపళంగా వంతెన కూలిపోవడంతో ఆ దృశ్యాన్ని చూసిన వారంతా పరుగులు తీశారు. సుమారు 20 అడుగుల లోతులో గ్రానైట్ లోడులో భారీ వాహనం. అందులోని డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటకు రావడంతో అక్కడి వారంతా ఊపిరి పీల్చుకున్నారు.


పరిమితికి మించి ప్రయాణం..

1929 ఫిబ్రవరి 5న అప్పటి మద్రాసు గవర్నరు ఇచ్ఛాపురంలో ఈ వంతెన ప్రారంభించారు. బ్రిటీష్ హయాం నుంచి శ్రీరామచంద్ర మహరాజ్‌గా పిలిచే ఈ వంతెన ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలకు వారధిగా సేవలు అందిస్తోంది. 30 టన్నుల మేరకు మాత్రమే పరిమితి కలిగిన ఈ వంతెనపై టన్నుల కొద్దీ భారీ లోడులతో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. బుధవారం ఉదయం ఏపీ 27 యుబి 2304 నంబరు గల లారీ ఒడిశాలోని అస్కా క్వారీ నుంచి ఒంగోలు జిల్లాకు చెందిన ఓ టీడీపీ మాజీ మంత్రికి చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీకి వెళ్తోంది. సుమారు 70 టన్నుల బరువు గల సామర్థ్యంతో వెళ్లిన ఈ భారీ లారీ బరువుకు తట్టుకోలేని వంతెన ముందు భాగం కుప్పకూలిపోయింది. దీంతో లారీ 20 అడుగుల లోతులో పడిపోయింది. ఆ సమయంలో వంతెనపై మరే ఇతర వాహనాలు ప్రయాణించకపోవడంతో ఘోర ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

నిలిచిన రాకపోకలు..

ఆంధ్రా–ఒడిశా సరిహద్దు వంతెన కావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. రూరల్ ఎస్‌ఐ వి.రమేష్ పోలీస్ బందోబస్త్ నిర్వహించి వాహనాలను జాతీయ రహదారిపై నుంచి బెల్లుపడ మీదుగా ఇచ్ఛాపురంలోకి మళ్లించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న పిరియా సాయిరాజ్, విజయ

వంతెన కూలిన విషయాన్ని తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో మాట్లాడారు. ప్రస్తుతం ఇచ్ఛాపురం పట్టణంలో స్వేచ్ఛావతి ఉత్సవ సంబరాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని కోరారు. శాశ్వత వంతెన నిర్మాణానికి సుమారు రూ.13 కోట్లు వరకు ఖర్చవుతుందని, ప్రస్తుతానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు రూ.40 లక్షలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. వెంటనే అంచనా తయారీ చేసి నివేదికను సమర్పించాలని ఆర్‌అండ్‌బీ డీఈ రామనాయుడుకు సూచించారు. నేషనల్ హైవే మెయింటెనెన్స్ అధికారితో మాట్లాడిన సమన్వయకర్త సాయిరాజ్ ఈదుపురం–బెల్లుపడ జంక్షన్ వద్ద యాక్సిడెంట్ జోన్ కావడం వల్ల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ నర్తు రామారావు, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డిలు ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు.



కూలిన బాహుదానది వంతెన

డ్రైవర్‌పై కేసు నమోదు..

పరిమితికి మించి వంతెనపై లారీని నడిపి, వంతెన కుప్పకూలే పరిస్థితికి కారణమైన లారీ డ్రైవర్ రాఘవేంద్రపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి.రమేష్ తెలిపారు.

